

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా

తాడేపల్లిగూడెం: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రయివేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు టి.రవిబాబు, పి.నాగేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రయివేటు పాఠశాలల్లో పుస్తకాలు, విద్యాసామగ్రి అమ్మరాదు, కానీ దానికి విరుద్ధంగా ప్రయివేటు పాఠశాలలో వేల రూపాయలకు అమ్ముతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని విద్యాశాఖాధికారుల దృష్టికి ఫోన్ చేసి తీసుకెళ్లినా కనీసం స్పందించడం లేదని తెలిపారు. విద్యాశాఖ అధికారులు, ప్రయివేటు పాఠశాలలు కుమ్మక్కై, విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని పాఠశాలలను సందర్శించి నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఖరీఫ్ నారుమళ్లు ముమ్మరం



- వర్షాల రాకతో సాగుకు రైతులు సన్నద్ధం
- రెండు జిల్లాల్లో 3.50 లక్షల ఎకరాల్లో వరి సాగు
- ఇప్పటివరకు 15 శాతం నారుమడులు పూర్తి
- నెలాఖరుకు నారుమళ్లు పూర్తయ్యే అవకాశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్ నారుమళ్ల పనులు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. వర్షాల రాకతో రైతులు ఖరీఫ్ సాగుకు నడుం బిగించారు. జూన్ ఒకటిన కాలువలకు నీరు విడుదల చేసినప్పటికీ ఎండల నేపధ్యంలో రైతులు నారుమడులు వేసేందుకు వెనుకంజ వేశారు. గడిచిన రెండు, మూడు రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో వాతావరణం చల్లబడింది. దీంతో రైతులు ఖరీఫ్ పనుల్లోకి దిగారు. ప్రస్తుత ఖరీఫ్‌లో పశ్చిమగోదావరి జిల్లాలో 2.39 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, ఏలూరు జిల్లాలో లక్షా పది వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు 15 శాతం నారుమళ్లు పూర్తయ్యాయి. ఈ నెలాఖరుకు ఖరీఫ్ నారుమడులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఖరీఫ్‌లో రైతులు ఎంటియు 1061, 1064, 7021 విత్తనాలను సాగు చేస్తున్నారు. ముందస్తు సాగుపై ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినప్పటికీ వడగాల్పులతో ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే జులై నెలాఖరుకు ఖరీఫ్ నాట్లు పూర్తయ్యే అవకాశం కన్పిస్తోంది. 50 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించాలని రైతులు కోరినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కేవలం కిలోకు రూ.ఐదు మాత్రమే సబ్సిడీ ఇచ్చింది. దీంతో రైతులు విత్తనాల కోసం పెద్దఎత్తున సొమ్ము వెచ్చించాల్సి వచ్చింది.

కౌలు రైతులకు రుణాలిచ్చేనా..?

ఖరీఫ్ సాగు ప్రారంభం కావడంతో రైతులకు పెట్టుబడులు పెద్దఎత్తున అవసరం. జిల్లా వ్యవసాయ సాగులో 75 శాతం సాగు కౌలు రైతులే చేస్తున్నారు. వీరందరికీ కౌలు కార్డులు అందించి రుణాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో కౌలు రైతులు ప్రయివేట్ వడ్డీ వ్యాపారుల నుంచి పెట్టుబడి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నూటికి రూ.మూడుకుపైగా వడ్డీ భారం రైతులపై పడుతుంది. ఏప్రిల్‌లో కౌలు కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించి ఇప్పటికే రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికీ కౌలు కార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాలేదు. భూయజమాని అంగీకారంతో కౌలు కార్డులు ఇవ్వాలన్న చట్టంలోని నిబంధన కౌలు రైతులకు శాపంగా మారింది. ఇప్పటివరకు కౌలు కార్డులపై రుణాల మంజూరు ప్రక్రియ ప్రారంభించిన దాఖలాలూ కన్పించడం లేదు. సమావేశాలు, సభల్లో కౌలురైతుల గురించి చెప్పడమే తప్ప వాస్తవ పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఇప్పటికైనా కౌలు రైతులకు కౌలు కార్డులు అందించి బ్యాంకుల నుంచి రుణాల మంజూరు చేయాల్సి ఉంది. లేకపోతే కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. అదే క్రమంలో కౌలు రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందించాలని కోరుతున్నారు.



సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎంఎల్‌సి, ప్రజా ప్రతినిధులు

పకడ్బందీగా జగనన్న సురక్ష అమలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో తాడేపల్లి నుంచి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, ఎంఎల్‌శ్రీ గ్రంధి శ్రీనివాస్, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, ఎంబిసి ఛైర్మన్ పెంద్ర వీరన్న, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య, డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అర్హత ఉండి పథకాలు అందని లబ్ధిదారులు ఉండకూడదనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు కచ్చితంగా మండలంలో జరుగుతున్న కార్యక్రమాన్ని పరిశీలించాలన్నారు. జగనన్న సురక్షపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లినప్పుడు చాలా ఓపికగా, సహనంతో వారి సమస్యలు విని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తొలకరి వర్షం.. మురిసిన నేల

జిల్లాలో పలు చోట్ల వర్షాలు, పల్లపుప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో శుక్రవారం ఉదయం భారీ వర్షం పడింది. 2 గంటల వ్యవధిలో 87.4 మి.మీ వర్షపాతం నమోదైంది. దాదాపు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయిన్లు, రోడ్లు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షానికి రైల్వేగేటు ప్రాంతం జలమయం అయ్యింది.



పాలకొల్లులో కురుస్తున్న వర్షం

ఆచంట : శుక్రవారం ఉదయం మండలంలో నాలుగు మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో చిన్నారులు, వృద్ధులు కాస్త ఉపశనం పొందారు. ఈ వర్షంతో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. నారుమడులు దమ్ములు చేసుకునేందుకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెనుమంట్ర : శుక్రవారం ఉదయం మండలంలో మోస్తారు వర్షం పడింది. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లే వారు ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా మార్టేరు, ఆలమూరు, భట్లమగుటూరు, బ్రాహ్మణచెరువు, పొలమూరు, పెనుమంట్ర, మాముడూరులో వర్షం పడింది. వాతావరణం మారడంతో వృద్ధులు, చిన్నారులు ఉపశమనం పొందారు.

పాలకోడేరులో జిల్లా ప్రత్యేక అధికారి కన్నబాబు పర్యటన

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరులో శుక్రవారం జిల్లా ప్రత్యేక అధికారి కన్నబాబు పర్యటించారు. మొగల్లులో నాడు- నేడు పనులు, జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న గృహ నిర్మాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రీసర్వే పనులు, రైతు భరోసా కేంద్రం సచివాలయ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలుసూచనలు సలహాలు అందజేశారు. పలు అంశాలలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతులతో పాటు ఆరోగ్య సేవలు కూడా బాగా అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోని డెలివరీ రూమ్, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, బాత్రూమ్లతో పాటు ఆసుపత్రి సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆసుపత్రి పనితీరును, 104 ద్వారా నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ క్యాంపుల పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. గ్రామాల నుంచి వచ్చే రోగులకు ఆసుపత్రి ద్వారా అన్ని వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ఆయన వెంట ఆర్‌డిఒ దాసి రాజు, డిఎంహెచ్ఒ మహేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి రమణ, ఎంపిడిఒ మురళి గంగాధర్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్‌కు పార్టీలు సహకరించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) 2024కు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లా కలెక్టరేట్లో ఎస్ఎస్ఆర్-2024పై నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను పరిశీలించాలన్నారు. ఒకే డోర్ నెంబరులో 10కి మించి ఓట్లు ఉంటే ప్రత్యేక పరిశీలన చేయాలన్నారు. ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారిని, చనిపోయిన ఓటర్లు ఉంటే వారిని గుర్తించి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఆ ఓట్లను తొలగించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటు ఉన్న ప్రతిఒక్కరికీ ఫొటో గుర్తింపు కార్డు ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ స్టేషన్లు తనిఖీలు చేయాలని, ఇబ్బందులుంటే దానికి బదులు వేరే పోలింగ్ స్టేషన్‌కు ప్రతిపాదనలు చేయాలని అన్నారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయిన తర్వాత ముసాయిదా ఎన్నికల జాబితా తయారవుతుందన్నారు. మండలాలు, గ్రామాల్లో ఎన్నికల సమావేశాలు నిర్వహించేటప్పుడు వివిధ పార్టీల నాయకులు కూడా హాజరయ్యేలా చూడాలన్నారు.

20 లేఅవుట్‌లలో పూడిక పనులు పూర్తి చేయాలి

జులై ఒకటో తేదీ నుంచి తహశీల్దార్, ఇఒపిఆర్‌డితో కూడిన ఒక బృందం, ఎంపిడిఒ, డిప్యూటీ తహశీల్దార్‌తో కూడిన మరో బృందం సచివాలయాల వారీగా క్యాంపులు నిర్వహించి అక్కడికక్కడే ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, లావాదేవీ మ్యుటేషన్లు, ఆధార్‌కు ఫోన్ నెంబరు అనుసంధానం, సిసిఆర్‌సి కార్డులు, కొత్త రేషన్‌కార్డు లేదా రేషన్‌కార్డు విభజన, కుటుంబ వివరాల్లో మార్పులు వంటి 11 రకాల సేవలను ఉచితంగా అందించనున్నట్లు వివరించారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని 20 జగనన్న లేఅవుట్లలో పూడిక పనులు పూర్తిస్థాయిలో చేపట్టి నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, డిఆర్ఒ కె.కృష్ణవేణి, ఆర్‌డిఒ దాసి రాజు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, వైసిపి, టిడిపి, సిపిఎం, సిపిఐ, బిజెపి, కాంగ్రెస్ నాయకులు కామన నాగేశ్వరరావు, జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, కోనాల భీమారావు, తోట గంగరాజు, మరపట్ల శ్యాబాంబు, మార్నిడి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - వీరవాసరం

పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని, కరెంటు కోతలను ఆపాలని, ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, సర్దుబాటు ఛార్జీల విధానాలను రద్దు చేయాలని, నాడు వైఎస్ జగన్ ఇచ్చిన మాట తప్పవద్దని నినదిస్తూ శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ వేళాపాళా లేని కరెంటు కోతలతో సతమతమవుతున్న వేళ కరెంటు బిల్లులు షాక్ కొట్టేలా వస్తున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై, గత సంవత్సరం కరెంటు ఛార్జీలు పెంచాయని విమర్శించారు. గత పది సంవత్సరాలుగా వాడుకున్న కరెంటుకు సర్దుబాటు పేరుతో రూ.ఆరువేల కోట్ల భారాన్ని ప్రజల నెత్తిపై వేయడం దుర్మార్గమన్నారు. ఈ నాలుగు సంవత్సరాల్లో తొమ్మిదిసార్లు కరెంటు ఛార్జీలు పెంచి రూ.25 కోట్లు భారం ప్రజలపై మోపారన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టి దాని ఖర్చును ప్రజల నుండి వసూలు చేయడానికి జగన్ ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. నాడు ప్రతిపక్ష నేతగా వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కరెంటు ఛార్జీల పెంపును నిరసిస్తూ కమ్యూనిస్టులతో కలిసి నిరాహార దీక్ష చేయడాన్ని గుర్తు చేశారు. పెంచుతున్న కరెంటు ఛార్జీలకు వ్యతిరేకంగా మరో పోరాటానికి అన్ని తరగతుల ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ పోతుల మృత్యుంజయ, నేతలు రెడ్డి రామారావు, కేతా జ్యోతిబసు, బొక్కా కూర్మారావు, జి.శ్యాంబాబు, పాలా కోటేశ్వరరావు, యాళ్లబండి నారాయణమూర్తి, బొంతు రామారావు, జుత్తిగ శ్రీనివాస్, మైగాపుల త్రిమూర్తులు, దొంగ నాగశ్రీను పాల్గొన్నారు.



వీరవాసరం సబ్ స్టేషన్ వద్ద ఎఇ రవీంద్ర వర్మకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా 30న ధర్నా

గణపవరం: విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈ నెల 26న సంతకాల సేకరణ, 30న స్థానిక సబ్ స్టేషన్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ తెలిపారు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎస్.సంజీవరావు అధ్యక్షతన జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనలో కరెంటు బిల్లులు చూస్తే షాక్‌కు గురయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి, నాయకులు పి.గోవింద్ మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందక ఇంజిన్లతో నీరు తోడుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. కౌలు రైతులకు భూమి యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డులు ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో చిన్నం చిననాగేశ్వరరావు పాల్గొన్నారు.



గిరిజనుల విల్లంబులతో సిపిఎం రాష్ట్ర నేతలు

గోదావరి ప్రవాహంలా పాదయాత్ర

- పెద్ద సంఖ్యలో పాల్గొంటున్న యువత
- 'పోలవరం పోరుకేక'కు పెరుగుతున్న మద్దతు
- గోడు చెప్పకుంటున్న పోలవరం నిర్వాసితులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన పోరుకేక పాదయాత్ర గోదావరి ప్రవాహంలా ముందుకు సాగుతోంది. ఈ నెల 20వ తేదీన ఎటపాక మండలం నెల్లిపాకలో యాత్ర ప్రారంభమైన యాత్ర 21న కూనవరం మండలంలో అడుగుపెట్టింది. ఈ మండలంలో 32 గ్రామాల్లో సుమారు 50 కిలో మీటర్లు పైగా పాదయాత్ర సాగింది. కూనవరం మండలంలో పోలిపాక నుండి పోచవరం కాలనీ, పోచవరం, కాచవరం, దూగుట్ట, కూళ్లపాడు, నర్సింగపేట, పోట్లవాయిగూడెం, కరక గూడెం, కొండాయి గూడెం, గొమ్ముగూడెం జంక్షన్, పల్లూరు, మర్రిగూడెం, చూచిరేవుల గూడెం, భీమవరం, జగ్గవరం, టేకులబోరు, కొండ్రాజపేట, పూసుగూడెం, చిన్న ఆర్కూరు, పెద్ద ఆర్కూరు, రేపాక, భగవాన్ పురం, మల్లూరు, కూటూరు, అభిచర్ల, లింగాపురం, రేగులపాడు, కోడేరు, రాయిగూడెం, బొజ్జరాయిగూడెం గ్రామాల్లో పాదయాత్ర జరిగింది. అనంతరం శుక్రవారం చింతూరు మండలంలోకి అడుగుపెట్టింది. అన్ని గ్రామాల్లోనూ పాదయాత్రకు ఘన స్వాగతం లభించింది. పాదయాత్ర సందర్భంగా ఏ జౌ న్సీ లో ఎర్రజెండా రెపరెపలాడుతోంది. గిరిజనుల హక్కుల కోసం సిపిఎం ఈ ప్రాంతంలో నిర్వహించిన పోరాటాలు ఫలితంగా ఆదివాసీలలో ఆ పార్టీకి చెరగని ముద్ర ఉంది. తాజాగా నిర్వహించిన పోరుయాత్ర లోనూ అదే ఒరవడి కనిపిస్తోంది. ముఖ్యంగా యువత అధిక సంఖ్యలో పాల్గొనటం ప్రత్యేకత సంతరించుకుంది. కూనవరం మండలంలో గ్రామ గ్రామాన గిరిజన యువత తరలివచ్చింది. దీంతో తొలుత సుమారు 500 మందితో ప్రారంభమైన యాత్ర 23వ తేదీనాటికి 800కు చేరింది. ఈ యాత్రకు వామపక్ష పార్టీలతోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు తమ మద్దతు తెలుపుతున్నారు.

గోడు చెప్పకుంటున్న నిర్వాసితులు

ఈ యాత్ర ఎదుట నిర్వాసితులు అనేక సమస్యలను విన్నవించారు. 'అభిచర్ల గ్రామంలో 250 కుటుంబాలు ఉన్నాయి. గతేడాది వరదల సమయంలో నెల రోజులు ముంపులో ఉంది. మూడు కిలో మీటర్లు వెళ్లి గుడిసెలు వేసుకుని జీవనం సాగించాం. వ్యవసాయ భూమి అంతా మునిగపోయింది' అని ఆ గ్రామస్తులు గోడు వినిపించారు.

'లింగాపురం 45.72 కాంటూరు పరిధిలో ఉందని చెబుతున్నారు. కాని గోదావరి భద్రాచలం వద్ద 37 మీటర్లకు చేరేనాటికే గ్రామం ముంపునకు గురైంది. 40 రోజుల పాటు గ్రామంలో వరద ముంపులో ఉంది. అయినా ముంపు గ్రామంగా ప్రకటించలేదు. పంట పొలాలకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వలేదు. నాలుగు సంవత్సరాల నుంచి ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదు. కనీసం విద్యుత్ సౌకర్యం కూడా కల్పించలేదు. గ్రామంలో 150 కుటుంబాలు ఉండగా, వరద సహాయం 70 కుటుంబాలకు మాత్రమే అందించారు' అని లింగాపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

'రేగులపాడులో 300 కుటుంబాలు ఉన్నాయి. 250 కుటుంబాలు మునిగిపోయాయి. అయినా ముంపు గ్రామంగా ప్రకటించలేదు. గ్రామంలో రోడ్లు లేవు, మంచినీటి సౌకర్యం పూర్తిగా లేదు. వరద సమయంలో ప్రభుత్వం ఎటువంటి సాయం అందించలేదు' అని ఆ గ్రామస్తులు వాపోయారు.

'రాయిగూడెంలో 28 కుటుంబాలు ఉన్నాయి. మా అడ్రసులు బొజ్జరాయి గూడెం చిరునామాతో ఉన్నాయి. ఈ కారణంతో మాకు ఎటువంటి నష్టపరిహారం, పునరావాసం అందలేదు. గిరిజన కుటుంబాలకు ఎటపాక రాయన గూడెంలో భూములిచ్చారు. కాని అక్కడి భూ యజమానులకు ప్రభుత్వం నగదు చెల్లించలేదు. దీంతో నేటికీ సాగు చేసుకునే అవకాశం మాకు కల్పించలేదు' అని రాయిగూడెం గ్రామస్తులు తెలిపారు.

ఆశాలకు అదనపు పని భారాన్ని తగ్గించాలి

ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పోశమ్మ

ప్రజాశక్తి - భీమవరం

ఆశాలకు అదనపు పని భారాన్ని తగ్గించాలని ఎపి వాలంటరీ హెల్త్ వర్కర్స్ (ఆశా) యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ డిమాండ్ చేశారు. వైద్యఆరోగ్య శాఖలో ఇతరులు చేసే పనులన్నీ ఆశాల చేత చేయించి మానసిక ఒత్తిడికి గురి చేయడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆశా వర్కర్ల జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు చింతపల్లి లక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోశమ్మ మాట్లాడుతూ వివిధ సర్వేల పేరుతో ఆశాలను ఇంటింటికీ తిప్పుతూ మరోవైపు పిహెచ్‌సిలకు, సబ్ సెంటర్‌కు వచ్చి సంతకాలు పెట్టాలని చెప్పడం సరైంది కాదన్నారు. రకరకాల యాప్‌ల పేరుతో ప్రభుత్వం ఇచ్చిన నాసిరకం ఫోన్‌లతో పని చేయమని ఒత్తిడి చేయడం, అవసరమైతే సొంత ఫోన్లు కొనుక్కోవాలని కొన్నిచోట్ల ఒత్తిడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. గర్భిణులను ఆసుపత్రికి తీసుకెళ్తున్నప్పుడు ప్రసవమయ్యే వరకూ అక్కడే ఉండాల్సి వస్తుందని, ఆసుపత్రుల్లో వసతులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్ని సందర్భాల్లో రోజులు తరబడి కాకినాడ, గుంటూరు, ఏలూరు వరకు వెళ్లి అర్ధరాత్రి ప్రయాణాలు చేయాల్సి వస్తుందని చెప్పారు. ఆశాలకు ఉద్యోగ భద్రత లేకుండాపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారుల ఆదేశాలను అమలు చేయడంలో దిగువస్థాయి అధికారులు వక్ర భాష్యాలు చెప్పి మానసిక ఒత్తిడికి, పని ఒత్తిడికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఏప్రిల్‌లో డిఎంహెచ్ఒతో జిల్లాలో సమస్యలపై జరిగిన చర్చలు పరిష్కారానికి నోచుకోలేదని విమర్శించారు. సెలవులు లేవనే పేరుతో కిందస్థాయి సిబ్బంది ఒత్తిడికి గురి చేస్తున్నారని, జిల్లా అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టానికి అనుగుణంగా జిల్లాలోనూ పిహెచ్‌సిల్లో కమిటీలు వేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శి దిగుపాటి జ్యోతి మాట్లాడుతూ జిల్లాలో ఆశా వర్కర్లు ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని, ప్రభుత్వాసుపత్రులపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా కృషి చేస్తున్నారని అన్నారు. విలేజ్ క్లినిక్‌లో పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు పెరగాల్సి ఉందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో సిబ్బంది నియామకాలు చేపట్టాలని కోరారు. చనిపోయిన, అనారోగ్యంతో ఉన్న ఆశాల కుటుంబాల్లో ఒకరికి ఆ ఉద్యోగాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్‌డి.బేగం, లారెన్స్‌కుమారి, ఆదిలక్ష్మి, పద్మ, జానకి, రాజేశ్వరి, రూప, శ్రీ వర్ధిని, వరలక్ష్మి, ప్రశాంతి మాట్లాడారు.




మాట్లాడుతున్న ఎపి వాలంటరీ హెల్త్ వర్కర్స్ (ఆశా) యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పోశమ్మ

షాక్ కొడుతున్న విద్యుత్ బిల్లులు

ఛార్జీలను ఉపసంహరించుకోవాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

సాధారణంగా విద్యుత్తును ముట్టుకుంటే షాక్ కొడుతుందని గానీ మే నెలలో వచ్చిన విద్యుత్ బిల్లులు చూస్తే ప్రజలకు షాక్ కొట్టిన పరిస్థితి ఏర్పడిందని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. మెంటేవారితోట పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కరెంటు ఛార్జీల భారాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకుల బృందం రెండు రోజులుగా విద్యుత్ బిల్లులను పరిశీలించారని తెలిపారు. అదనపు ఛార్జీలు, విద్యుత్ కోతలతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారన్నారు. గతంలో వచ్చిన బిల్లులకు రెండు రెట్లు అదనంగా బిల్లులు రావడం దారుణమన్నారు. వినియోగించిన విద్యుత్ కాకుండా సర్వీస్ ఛార్జీల పేరుతో ఈ నెల బిల్లులో 2014లో వాడుకున్న విద్యుత్ మళ్లీ యూనిట్‌కు 20 పైసలు, 2021 మే నెలలో వాడిన విద్యుత్తు యూనిట్‌కు మరో 20 పైసలు, 2023 ఏప్రిల్‌లో ఉపయోగించిన కరెంటుకు యూనిట్‌కు 40 పైసలు కలిపి మొత్తం యూనిట్‌కు 80 పైసలు చొప్పున జనం నెత్తిన వేశారన్నారు. ఇప్పటికే ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్‌ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల భారాన్ని విరమించుకోవాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలను ఐక్యంచేసి సిపిఎం మరో విద్యుత్ ఉద్యమానికి సన్నద్ధమౌతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, కవురు పెద్దిరాజు, బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బలరాం


వంతెన పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

శరవేగంగా తాడేరు వంతెన పనులు

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తాడేరు వంతెన పనులు శర వేగంగా జరుగుతున్నాయని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రూ.2.30 కోట్లతో చేపట్టిన వంతెన పనులను శుక్రవారం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ర్యాఫ్ట్ ఫౌండేషన్ పనులు జరుగుతున్నాయన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడడం లేదన్నారు. వంతెన నిర్మాణానికి సంబంధించిన పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇటుగా ప్రయాణించే వాహనదారులు పూర్తిగా సహకరించాలని కోరారు. ఆయన వెంట ఆర్అండ్‌బి ఇఇ లోకేశ్వరరావు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, డిఇ రామరాజు, శిరిగినీడి ప్రసాద్ ఉన్నారు.

వారాహి యాత్రను జీర్ణించుకోలేకే కుట్ర

మాజీ మంత్రి జోగయ్య

ప్రజాశక్తి - పాలకొల్లు

పవన్ కల్యాణ్ వారాహి యాత్ర విజయాన్ని ముద్రగడ జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని కాపు సంక్షేమ సేన అధ్యక్షులు చేగొండి హరిరామ జోగయ్య విమర్శించారు. శుక్రవారం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కాపులను ఉద్ధరించడానికి పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టలేదని, రాష్ట్ర ప్రజలు ఆర్థికంగా సామాజికంగా ఎదగాలని పార్టీ పెట్టారని చెప్పారు. కాపులు ఒక్కరూ మద్దతిస్తే పవన్ కళ్యాణ్ అధికారంలోకి రారని చెప్పారు. వారాహి యాత్రకు భారీగా ప్రజలు రావడాన్ని జీర్ణించుకోలేక జగన్, చంద్రశేఖర్ రెడ్డి, ముద్రగడతో నాటకం ఆడిస్తున్నారన్నారు.

బాధితునికి చేయూత

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట పంచాయతీ పరిధి బొంతువారిపాలెంకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు బొంతు వీర్రాజు (61) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వీర్రాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వీర్రాజు కుటుంబానికి భవన నిర్మాణ కార్మిక సంఘం తరపున రూ.5 వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, కనకదుర్గ సంఘం నాయకులు కేతా నాగాంజనేయులు, అడ్డాల నర్సింహమూర్తి, నిమ్మన ఏడుకొండలు, బి.శ్రీనివాస్, కె.డేవిడ్ రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన

ప్రజాశక్తి - గణపవరం

పిప్పర గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసు బాబు శంకుస్థాపన చేశారు. స్థానిక బిసి ఏరియాలో రూ.17 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులకు, రూ.నాలుగు లక్షలతో మంచినీటి రేవు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కాకర బేబి, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, ఎంపీపి దండు వెంకటరామరాజు, తహశీల్దార్ పమ్మి లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చి ప్రగతి పథంలో ఉండాలని కెజిఆర్ఎల్ ఫార్మసీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కవల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కెజిఆర్ఎల్ కళాశాలలో లయన్స్ క్లబ్, శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో బి.ఫార్మసీలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రతిభ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఒక ఆశయంతో ముందుకు సాగాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 26 మంది ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు నందమూరి రాజేష్, కళాశాల ప్రిన్సిపల్ రాఘవ, కృష్ణా, తూర్పు గోదావరి జిల్లా ఆదిత్య విద్యాసంస్థల కో ఆర్డినేటర్ నాగేంద్ర బాబు, లయన్స్ క్లబ్ కార్యదర్శి నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

డ్రైడేలో ప్రజల భాగస్వామ్యంతో దోమల ద్వారా వచ్చే వ్యాధుల నియంత్రణకు అడ్డుకట్ట వేయెుచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం మాధవరం పిహెచ్‌సి పరిధిలోని కొత్తూరు, నవంపాలెం, కృష్ణయపాలెంలో జరుగుతున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పరిసరాల పరిశుభ్రత ద్వారా దోమల వ్యాప్తికి అడ్డు కట్ట వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అశోక్‌బాబు, గ్రామ ఆరోగ్య కార్యదర్శులు విజయ నిర్మల, ఎంఎల్‌హెచ్ పిఎం.ఆశాలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడులో వైఎస్ఆర్ బీమా పథకంలో పాలా సుబ్బారావుకు పది వేల రూపాయల ఆర్థిక సాయాన్ని ఎంపిటిసి చిన్నాపరపు రాంబాబు చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఇటీవల పాలా సుబ్బారావు భార్య పాలా మహిమ కుమారి ఈ నెల 2న గుండెపోటుతో మృతి చెందారు. వైఎస్ఆర్ బీమా ద్వారా మంజూరైన లక్ష రూపాయాల్లో ముందుగా రూ.10,000 గ్రామ పెద్దల సమక్షంలో వారి భర్త పాలా సుబ్బారావుకు అందజేశారు. మిగిలిన రూ.90,000 వారి నామిని ఖాతాలో జమ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి చిన్నాపరపు రాంబాబు, వైసిపి గ్రామ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నవోదయకు ముప్పర్తిపాడు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - గణపవరం


వి.ప్రశాంత్

మండలంలో ముప్పర్తిపాడు ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి వీధి ప్రశాంత్ నవోదయకు ఎంపికైనట్లు ఎంఇఒ పి.శేషు శుక్రవారం చెప్పారు. నవోదయకు ఎంపికైన ప్రశాంత్‌కు గ్రామ సర్పంచి కర్రి రాధాలక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బాధితునికి వసుధ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు


సాయం అందజేస్తున్న సభ్యులు


యలమంచిలి మండలం మేడపాడుకు చెందిన కూనపు రెడ్డి మణికుమారి గత కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలిసిన విజయ ల్యాబ్ అధినేత కొమ్ములమురళీకష్ణ వసుధ ఫౌండేషన్ వారికి తెలిపారు. వెంటనే వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు స్పందించి అనారోగ్యంతో బాధపడుతున్న రోగికి రూ.10 వేల చెక్కును శుక్రవారం పాలకొల్లులో విజయ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకష్ణ, పెన్మత్స జగపతి రాజు ,పెన్మత్స బుద్ధరాజు చేతుల మీదుగా బాధితురాలు భర్త కునపురెడ్డి రెడ్డి సూర్యనారాయణ, కుమార్తె నాగ కనకదుర్గాదేవి కి చెక్ అందించారు. వసుధ ఫౌండేషన్ వారికి బాధితుల బంధువులు ధన్యవాదాలు తెలిపారు.

ప్రమాదకరంగా గడువుతీరిన భవనాలు!

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో గడువు తీరిన భవంతులు శిథిలావస్థకు చేరినా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కెనాల్ రోడ్డులో చోడిశెట్టి సూర్యారావు విగ్రహం వెనుక వెలమగూడెంలో ఓ హోటల్ శిథిలావస్థకు చేరింది. దాని పక్కనే సచివాలయం ఉంది. హోటల్ యాజమాన్యం రెండు నెలలుగా ఆ భవనాన్ని పడగొట్టడంతో రోడ్డంతా భవనం మెటీరియల్‌తో మూసుకుపోయింది. దీంతో అటుగుండా వెళ్లే దారిలేక సచివాలయ సిబ్బంది, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయినా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. హోటల్ యాజమాన్యం కూల్చిన మెటీరియల్ రోడ్డు పైనే వదిలేయడంతో స్థానికుల తిప్పలు అన్నీఇన్నీ కావు. ఇంతజరుగుతున్నా సచివాలయ సిబ్బంది కూడా ఫిర్యాదు చేయకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఇలాగే పట్టణంలో మరిన్న భవనాలు గడువు తీరి ఉన్నా మున్సిపల్ సిబ్బంది కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మున్సిపల్ కౌన్సిల్ లేకపోవడం, ప్రత్యేక అధికారి ఉన్నా అలంకరప్రాయంగా ఉండటం, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఏమీ పట్టించుకోకపోవడంతో పట్టణంలో ఆక్రమణలు పెరిగి పోతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న భవనాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


వెలమగూడెంలో రోడ్డు


వెలమగూడెం వద్ద రోడ్డపై బిల్డింగ్ మెటీరియల్ పడేయడంతో మూసుకుపోయిన రోడ్డు

జగనన్న సురక్ష విజయవంతానికి కృషి చేయాలి : ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ప్రజలు సంతృప్తి చెందే విధంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు సేవలందించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జగన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి జగ్మోహనరెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్నుద్దేశించి మాట్లాడుతున్న లైవ్ వీడియోను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష విధి విధానాలను పూర్తిగా ఆకళింపు చేసుకుఇని, ప్రజల అవసరాలకు అనుగుణంగా సమస్యల పరిష్కరానికి సంబంధిత సిబ్బంది కృషి చేయాలన్నారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కార్యక్రమాన్ని వివరించడంతోపాటు వారికి అవసరమైన సర్వీస్‌లను నమోదు చేసుకుని సిద్ధంగా ఉంచాలన్నారు. జులై 1వ తేదీ నుండి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ వార్డు సచివాలయం వద్ద ప్రత్యేక క్యాంపులను నిర్వహించడం జరుగుతుందన్నారు. సచివాలయాల వద్ద నిర్వహించే క్యాంపుల్లో ఈ 11 సర్వీసులకు ఎలాంటి సర్వీసు ఛార్జీలు ఉండవని పేర్కొన్నారు. అయితే, మ్యుటేషన్ సర్టిఫికేట్ లకు సంబంధించి పాస్ పుస్తకాల జారీకి దరఖాస్తుదారులు చెల్లించాల్సిన స్టాట్యుటరీ ఛార్జీలను మాత్రం వసూలు చేయడం జరుగుతుందన్నారు. నాలుగు వారాల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ జయరాజు, వైస్ ఛైర్మన్ కొత్తపల్లి భుజంగ రాయుడు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


తణుకు: కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలు సంతృప్తి చెందేలా ప్రభుత్వ సేవలందించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్ష కార్యక్రమం విజయవంతానికి అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు కృషి చేయాలన్నారు. జులై 1వ తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయం వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో కుల, నివాసం, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్డేట్, కౌలు గుర్తింపు కార్డులు, కొత్త రేషన్ కార్డులు వంటి సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే విధంగా జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ముఖ్యమంత్రి జగన్ రూపొందిస్తున్న కార్యక్రమాలతో రాష్ట్రం దేశానికి ఒక రోల్ మోడల్‌గా నిలిచిపోతుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం నుంచి డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ పాల్గొన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణకు జిల్లా, మండల సచివాలయ స్థాయిలో ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయన్నారు. శనివారం నుంచి ప్రతి సచివాలయంలోనూ క్లస్టర్ల వారీగా బృందాలు గృహాలను సందర్శించి ఆయా కుటుంబాల నుంచి వివరాలు సేకరించి, సమస్యలు ఉంటే తెలుసుకుంటారన్నారు. జులై 1 నుంచి 31వ తేదీ వరకూ సచివాలయాల్లో శిబిరాలు నిర్వహించి ప్రజల సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్, మున్సిపల్ ఇంజినీర్ డి.మురళీకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, టిపిఒ హరిప్రసాద్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు 50 శాతానికిపైగా ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉపాధి హామీలో ఎస్‌సి, ఎస్‌టిలకు 50 శాతం పైబడి పనులు కేటాయించాలని పిఆర్అండ్ఆర్‌డి డిప్యూటీ కమిషనర్ సిహెచ్ భవాని సూచించారు. మండలంలోని వారతిప్ప, పేరుపాలెం, కెపిపాలెం, మొగల్తూరు తదితర గ్రామాల్లో ఆమె శనివారం అధికారులతో కలిసి పర్యటించారు. అమృత్ సరోవర్‌లో భాగంగా పూడిక తొలగించిన చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కల నాటాలని, ఉద్యానవన పంటల సాగుకు ఉన్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. డ్వామా పీడీ ఎస్‌టివి.రాజేశ్వరరావు మాట్లాడుతూ పాలకమ్మ చెరువులో 364 మంది జాబు కార్డుదారులు ఉండగా 100 కుటుంబాలే ఎందుకు వస్తున్నారని, మిగిలినవారు రాకపోవడానికి కారణాలు ఏంటని సిబ్బందిని ప్రశ్నించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ వంద దినాల పనికి వచ్చేలా చూడాలకి, వారికి నిర్ణీత వేతనం అందేందుకు అవసరమైన కొలతల మేరకు పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఎపిడి విజయలక్ష్మి, ఎంపిడిఒ యు.బాబ్జిరాజు, ఎపిఒ శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి ఎం.నవీన్‌కిరణ్, టెక్నికల్ అసిస్టెంట్ జె.వెంకటేశ్వరరావు, ఎసి ఆనంద్ పాల్గొన్నారు.


చెరువులు పరిశీలిస్తున్న అధికారులు

వైఎస్ఆర్ పశు బీమాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పశు పోషణపై ఆధారపడ్డ పాడి రైతులు వైఎస్ఆర్ పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఈ పథకానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. రైతులు ఎక్కువ శాతం మంది పశు పోషణపై ఆధారపడి ఉన్నారన్నారు. పశువులకు ప్రమాదం జరిగిన సమయంలో వైఎస్ఆర్ పశుబీమా పథకం ద్వారా రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించేందుకు ముఖ్యమంత్రి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన రైతులు గేదెలు, ఆవులకు సంబంధించి రూ.200 చెల్లిస్తే సరిపోతుందని, పశువులకు ప్రమాదం జరిగిన సమయంలో ప్రభుత్వం రూ.15 వేలను నష్టపరిహారంగా చెల్లిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఎడి పి.సుధీర్‌బాబు, పశువైద్యులు పి.పుండరీ బాబు పాల్గొన్నారు.

పెనుమంట్ర : పాడి రైతులు వైఎస్ఆర్ పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలని పెనుమంట్ర వెటర్నరీ వైద్యురాలు జి.వరలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న రైతులు 20 శాతం, లేనివారు 50 శాతం ప్రీమియం చెల్లిస్తే సరిపోతుందన్నారు. పశువులకు మూడేళ్ల పాటు, జీవాలకు, పందులకు 1 నుండి మూడు సంవత్సరాల పాటు బీమా వర్తిస్తుందన్నారు. నెలలు, సంవత్సరాలపాటు కాలయాపన లేకుండా పశువులు మరణించిన 21 రోజుల్లోపు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో పరిహారం జమయ్యేలా నిబంధన పెట్టడం జరిగిందన్నారు. ఏదైనా సాంకేతిక కారణాల వల్ల పరిహారం జమ కాకపోతే ఆ విషయాన్ని ఆన్‌లైన్లో పెట్టాలని తెలిపారు. అప్రూవ్డ్ బీమా ప్రీమియం వివరాలకు ఆవులు, గేదెలు, మగ పశువులకు మూడు సంవత్సరాలకు 6.4 శాతం, గొర్రెలు, మేకలు, పందులకు సంవత్సరానికి 3 శాతం, రెండు సంవత్సరాలకు 4.5 శాతం, మూడు సంవత్సరాలకు 6.25 శాతం ప్రీమియం వర్తిస్తుందన్నారు. యాజమాన్యం సదవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఉండిలో భారీ అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - ఉండి

స్థానిక పెద్ద వంతెన సెంటర్లోని చలమలశెట్టి ప్లాజాలోని పద్మజ స్టూడియో, రెడీమేడ్ బట్టల షాపులో శుక్రవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు వెంటనే స్పందించి విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేశారు. అదే సమయంలో అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి సూర్యప్రకాష్‌రావు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి స్థానికుల సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే స్థానికులు స్పందించి తమకు, విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో పెనుప్రమాదం తప్పిందన్నారు. షాపు యజమాని చలమలశెట్టి సత్యనారాయణ ఊరెళ్లడంతో ఆయన భార్య ఒక్కరే షాపుపై అంతస్తులోని ఇంటిలో ఉన్నారని వారు తెలిపారు. షాపులో నుంచి పొగలొస్తున్నాయని స్థానికులు చెప్పడంతో సత్యనారాయణ భార్య పై అంతస్తు నుంచి కిందకు దిగి రావడంతో ఎటువంటి ఇబ్బందీ తలెత్తలేదు. ఈ ప్రమాదంలో సుమారు రూ.40 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు, ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమై ఉండొచ్చని భావిస్తున్నట్లు సూర్యప్రకాష్‌రావు తెలిపారు. సంఘటనా స్థలాన్ని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షాపు యజమాని ఫొటోగ్రాఫర్ కావడంతో సుమారు రూ.ఐదు లక్షలు విలువైన కెమెరాలు దగ్ధమయ్యాయని తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎంఎల్ఎ మంతెన రామరాజు సందర్శించి షాపు యజమాని చలమలశెట్టి సత్యనారాయణను పరామర్శించారు. ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి సత్యనారాయణకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి స్థానికుల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారని, లేనిపక్షంలో పక్కనే ఉన్న చాలా దుకాణాలు, ఇళ్లలోకి మంటలు వ్యాపించేవని అన్నారు. ఎంఎల్ఎ వెంట టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు, మాజీ జెడ్‌పిటిసి కాగిత మహంకాళి, పార్టీ గ్రామాధ్యక్షులు కాగిత వెంకట సత్యనారాయణ తదితరులు ఉన్నారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మహేశ్వరరావు అన్నారు. పాలకోడేరులో డ్రైడే -ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికున్ గున్యా తదితర జ్వరాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా వైద్య సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. వీరి వెంట డాక్టర్ రంగం నాయుడు, ప్రకతి వైద్యురాలు డాక్టర్ సుజన, సిహెచ్వో సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


డ్రెయినేజీని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ మహేశ్వరరావు


శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొట్టు

అభివృద్ధి పనులకు మంత్రి కొట్టు శంకుస్థాపన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక 24వ వార్డులో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. 200 మీటర్ల పొడవునా సీసీ రోడ్డు, ఇరువైపులా సీసీ డ్రెయినేజీలు నిర్మించనున్నారు. వార్డు బాట హామీల అమల్లో భాగంగా మున్సిపల్ జనరల్ నిధులతో ఈ పనులు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టూ టౌన్ సచివాలయాల కన్వీనర్ కర్రి భాస్కరరావు, వన్ టౌన్ సచివాలయాల కన్వీనర్ కొలుకులూరి ధర్మరాజు, మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ పాల్గొన్నారు.

నేడు పాలకవర్గ సమావేశం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం శనివారం నిర్వహించనున్నామని ఎంపిడిఒ యు.బాబ్జిరాజు తెలిపారు. ఈ సమావేశానికి పాలకవర్గ సభ్యులు, సంబంధిత శాఖ అధికారులు హాజరుకావాలని ఆయన సూచించారు.

విద్యుత్ సమస్యలుంటే 1912కు కాల్ చేయండి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో శుక్రవారం విద్యుత్ వాడకం సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విశ్రాంత సెషన్స్ న్యాయమూర్తి సిజిఆర్ఎఫ్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ వినియోదారులకు వాడకంలో సమస్యలు ఏర్పడితే టోల్ ఫ్రీ నంబరు 1912కు కాల్ చేస్తే 6 గంటలకు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, ఎలక్ట్రికల్ ఎఇ వెంకటేశ్వరరావు, కాలేజీ లెక్చలర్లు టి.అక్కరాజు, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

కౌలు కార్డులు వెంటనే ఇవ్వాలి

ప్రజాశక్తి - అత్తిలి

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు త్వరితగతిన ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డుల మంజూరుపై విఆర్ఒ, విఆర్ఎ, విఎఎలతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సిసిఆర్‌సి కార్డులపై కౌలు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం స్థానిక రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఒ టికె.రాజేష్, తహశీల్దార్ ఎ.రామాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటావధాని జయంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆతరం పండితులు, కవులు సాహిత్యపు విలువలతో కూడిన రచనలు చేసేవారని, సాహితీ లోకంలో పారిజాతం డాక్టర్ దివాకర్ల వెంకటావధని అని తెలుగు పండితులు, రచయిత కలిగోట్ల గోపాలశర్మ అన్నారు. శుక్రవారం స్థానిక జిటిపి మహిళా బిఇడి కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో కళాప్రపూర్ణ దివాకర్ల వెంకటావధని జయంతి వేడుకలు నిర్వహించారు. గోపాలశర్మ మాట్లాడుతూ విమర్శకుడిగా ఏక సందగ్రహిగా ఆనాడు దివాకర్లకు పేరు తెచ్చి పెట్టాయన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, రామరాజ భూషణ సాహిత్య పరిషత్ కార్యదర్శి చుక్కన శ్రీలు మాట్లాడారు. దివాకర్ల ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు పండితునిగా ఎనలేని సేవలు అందించారని అన్నారు. అనంతరం డాక్టర్ దివాకర్ల కుటుంబంతో అనుబంధం ఉన్న కలిగోట్ల గోపాలశర్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జి.సతీష్, ప్రయాగ మాణిక్యాలరావు పాల్గొన్నారు.


సాయం అందజేస్తున్న సర్పంచి

పేదలకు భాస్విని ట్రస్ట్ సాయం

ప్రజాశక్తి - కాళ్ల

దొడ్డనపూడిలో ఇటీవల మరణించిన పాలపర్తి డేవిడ్, యడవల్లి లక్ష్మీకాంతమ్మ కుటుంబాలను సర్పంచి కొల్లి సుబ్బారావు శుక్రవారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.పది వేల ఆర్థిక సాయం భాస్విని ట్రస్ట్ ద్వారా సర్పంచి కొల్లి సుబ్బారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరేటి వెంకయ్య, కొల్లి సురేష్, కొల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.